# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో ఎడతెరిపిలేని వర్షాల కారణంగా ప్రాణ నష్టం జరగకుండా చూడటంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.**

2. **తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు.**

3. **పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం శ్రీకాకుళం జిల్లా కళింగపట్నానికి దక్షిణంగా 40 కిలోమీటర్లు, విశాఖపట్టణానికి ఈశాన్యంగా 80 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది.**

4. **2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడానికి దక్షిణాది రాష్ట్రాలు వేగంగా వృద్ధి చెందడం కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టంచేశారు.**

5. **ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 93.28 శాతం పంపిణీ పూర్తయింది.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో ఎడతెరిపిలేని వర్షాల కారణంగా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడటంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్న జిల్లాల్లో సహాయక చర్యల కోసం జిల్లాకు 3 కోట్ల రూపాయల చొప్పున నిధులు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయనే సమాచారం ఉన్నందున వర్షాలు తగ్గే వరకు అత్యవసరమైతే తప్ప.. బయటకు రావొద్దని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. నిన్న అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకున్న ముఖ్యమంత్రి భారీ వర్షాలు, వరదలపై ఆయా ప్రాంతాల్లో పరిస్థితులు, సహాయక చర్యలపై నిరంతరం సమీక్షించారు. తాజా పరిస్థితిపై మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పోలీస్ డైరెక్టర్ జనరల్, జిల్లాల కలెక్టర్లు, పోలీస్ సూపరింటెండెంట్‌లతో పలు దఫాలుగా శ్రవణ సమావేశం నిర్వహించారు. భారీ వర్షాల కారణంగా విజయవాడలో కొండ చరియలు విరిగిపడి ఐదుగురు, మంగళగిరిలో ఒకరు, గుంటూరు జిల్లాలో వాగులో కారు కొట్టుకుపోయి ముగ్గురు మొత్తం.. తొమ్మిది మంది మరణించగా, మృతుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల చొప్పున పరిహారం అందించాలని ఆదేశించారు.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో తీరం వెంబడి ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని, విపత్తు సమయంలో ప్రజలకు అండగా నిలిచి, ప్రాణనష్టం లేకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. అదే విధంగా అధికారుల

సూచనలను ప్రజలు తప్పకుండా పాటించాలని కోరారు. వరద బాధితుల పునరావాస చర్యల్లో ఖర్చుకు ఎక్కడా వెనుకాడొద్దని, పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలూ అందేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. భారీవర్షాలు, వరదల నేపథ్యంలో సహాయక చర్యలపై జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులతో నిన్న రాత్రి పొద్దుపోయిన తర్వాత మరోసారిఆయన శ్రవణ సమావేశం నిర్వహించారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో నిన్న విస్తారంగా వర్షాలు కురిశాయి. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడ్డాయి. రాష్ట్రంలోని 16 ప్రాంతాల్లో 100 మిల్లీమీటర్ల పైగా వర్షపాతం నమోదైంది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పలుచోట్ల వాగుల్లో వాహనాలు చిక్కుకున్నాయి. విజయవాడ, గుంటూరు నగరాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వర్షాలకు వాగులు, వంకలు, కాలువలు పొంగి, చిన్నపాటి వంతెనలపై భారీగా నీరు పారింది. భారీవర్షాల నేపథ్యంలో కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, వర్షాలు, వరద పరిస్థితిని అధికారులు సమీక్షిస్తున్నారు. జోరు వర్షాలతో పలు జిల్లాల్లో పాఠశాలలకు విద్యాశాఖ సెలవు ప్రకటించింది. మత్స్యకారులను వేటకు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేయడంతో బోట్లన్నీ తీరానికి చేరాయి. ఈ రోజు, రేపు కాకినాడ జిల్లాకు భారీ వర్ష సూచన జారీ అయింది. ఈ మేరకు వాతావరణశాఖ జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. కాకినాడ పోర్టులో మూడో నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగురవేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీలో వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కృష్ణా డెల్టా ప్రాంతంలో వేలాది ఎకరాల్లో వరి చేలు నీట మునిగాయి. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి, కర్నూలు జిల్లాల్లో కాలువలు, వాగుల కింద వరి పొలాలు జలమయమయ్యాయి. అపరాల పంటలు వానకు దెబ్బతినగా, లోతట్టు ప్రాంతాల్లోని పత్తి, మిర్చి పైర్లు ఉరకెత్తే స్థితిలో ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 62 వేల 550 హెక్టార్లలో పంట ముంపుబారిన పడినట్టు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది.

---------------------------

వరద ప్రభావిత ప్రాంతాల్లో త్వరితగతిన సహాయక చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయం నుంచి నిన్న ఆమె జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులతో దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు.

---------------------------

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అత్యవసర సహాయం కోసం ఎమర్జెన్సీ స్టేట్ కంట్రోల్ రూమ్ రుసుము రహిత నంబర్లు 1070, 112, 18004250101ను సంప్రదించాలని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కూర్మనాథ్ సూచించారు.

---------------------------

ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపడంలో భారతీయ రైల్వే ఎంతో పురోగతి సాధించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొనియాడారు. సమాజంలోని అన్ని వర్గాల వారికీ సౌకర్యవంతమైన ప్రయాణం అందించడమే రైల్వే లక్ష్యమని, అప్పటి వరకు ఆగేది లేదని పేర్కొన్నారు. లఖ్‌నవూ– మేరఠ్, మదురై– బెంగళూరు, చెన్నై– నాగర్‌కోయిల్ మధ్య వందేభారత్ రైళ్లను నిన్న ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.. కేవలం సమస్యలకు పరిష్కారం చూపడమే కాకుండా.. రైల్వే కొత్త ఆశలు

చిగురింపజేస్తోందని పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడానికి దక్షిణాది రాష్ట్రాలు వేగంగా వృద్ధి చెందడం కీలకమని స్పష్టంచేశారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు పెంచిన బడ్జెట్ కేటాయింపుల వల్ల దక్షిణాదిలో రైలు రవాణా మరింత బలోపేతం అవుతుందని ప్రధానమంత్రి తెలిపారు.

-------------------------

తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా  ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, పోలీస్ డైరెక్టర్ జనరల్‌కు ఆయన సూచించారు. ఈ క్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లతో నిన్న శ్రవణ సమావేశం నిర్వహించారు. వరదల విషయంలో చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్యబృందాలను అప్రమత్తం చేయాలని సూచించారు.

-------------------------

భారీ వర్షాల ప్రభావంతో ఈ రోజు, రేపు వివిధ మార్గాల్లో నడవాల్సిన 25 రైళ్లను రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ రోజు విజయవాడ-తెనాలి విజయవాడ-గుంటూరు, విజయవాడ- కాకినాడ పోర్టు, తెనాలి-రేపల్లె, గుడివాడ-మచిలీపట్నం, భీమవరం- నిడదవోలు, ఒంగోలు-విజయవాడ, మచిలీపట్నం-విజయవాడ మార్గాల్లోని రైళ్లను రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు. రేపు గుంటూరు-రేపల్లె, గుంటూరు-విజయవాడ, విజయవాడ-సర్సాపూర్ రైళ్లను రద్దు చేశారు. రైళ్ల రద్దు, దారి మళ్లింపు సమాచారాన్ని ప్రయాణికులకు తెలియజేయడానికి దక్షిణ మధ్య రైల్వే హెల్ప్ లైన నెంబర్లను ప్రకటించింది.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నా.. నిన్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిరాటంకంగా కొనసాగింది. ఈ రోజు సెలవు కావడంతో ప్రభుత్వం ఒక రోజు ముందే పింఛన్ల పంపిణీ చేపట్టింది. జోరు వానలోనూ సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిన్న రాత్రి  7 గంటల సమయానికి 93.28 శాతం పంపిణీ పూర్తయింది. 60 లక్షల 27 వేల మంది లబ్ధిదారులకు, 2 వేల 545 కోట్ల 74 లక్షల రూపాయలకు పైగా అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కర్నూలు జిల్లా ఓర్వకల్లులో పింఛన్ల పంపిణీలో పాల్గొనాల్సి ఉండగా, ఎడతెరిపి లేకుండా వర్షం కారణంగా పర్యటన రద్దు చేసుకుని.. పింఛన్ల పంపిణీ తీరును అమరావతి నుంచి సమీక్షించారు.

-------------------------

ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాకు ఆనుకుని పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతోంది. శ్రీకాకుళం జిల్లా కళింగపట్నానికి దక్షిణంగా 40 కిలోమీటర్లు, విశాఖపట్టణానికి ఈశాన్యంగా 80 కిలోమీటర్ల దూరంలో ఇది కేంద్రీకృతమైంది. ఈ వాయుగుండం వాయవ్యంగా పయనించి గత అర్ధరాత్రి తర్వాత విశాఖపట్నం – గోపాల్‌పూర్ మధ్య తీరం దాటుతుందని వాతావరణశాఖ భావించినా.. గడచిన 8 గంటలుగా అదే ప్రాంతంలో స్థిరంగా కొనసాగుతోంది. దీని ప్రభావంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కుంభవృష్టిగా, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో భారీనుంచి అతిభారీగా, కోస్తాలోని మిగిలిన జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.  తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున కోస్తాలో అన్ని ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు.

---------------------------

పెద్దపల్లి జిల్లాలోని రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేయాలని నిర్ణయించామని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించామని పేర్కొన్నారు. రామగుండంలో బి పవర్‌హౌస్‌ను నిన్న సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. కొద్ది రోజుల్లోనే పవర్ ప్రాజెక్టుపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సింగరేణి – జెన్‌కో జాయింట్‌గా పవర్ ప్రాజెక్టును ప్రారంభించే దిశగా చర్యలు చేపడతామని చెప్పారు. అందరి కోరిక మేరకు బి పవర్ హౌస్ పవర్ ప్రాజెక్టును ముందుకుతీసుకెళ్తామన్నారు.

---------------------------

భారీ వర్షాల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కమ్)లను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. నిన్న ఆయన డిస్కమ్ ఉన్నతాధికారులతో శ్రవణ సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ విద్యుత్తు పంపిణీ సంస్థల ఇంజనీరింగ్, ఫీల్డ్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని, ఉపరిత ఆవర్తనం కారణంగా బలమైన గాలులూ వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిందని తెలిపారు. ఈ క్రమంలో విద్యుత వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు.

======================